గ్రామీణ రోడ్లకు మహర్దశ


నడిగూడెంలోని బీసీ కాలనీలో నిర్మించిన సీసీ రహదారి


సిరిపురంలో ..

- గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.2.35 కోట్లు మంజూరు
- ముమ్మరంగా సాగుతున్న పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

నడిగూడెం : మండలంలోని గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టింది. రోడ్ల నిర్మాణానికి గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం అధిక నిధులు కేటాయించడంతో గ్రామాల్లో గత వారం రోజులుగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే గతంలో గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉండి ప్రజలు రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండేది. అదేవిధంగా అంతర్గత రహదారుల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతుండేవి. దీంతో ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి సీసీ రోడ్లు నిర్మిస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.2.35 కోట్లు మంజూరు

మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం రూ.2.35 కోట్లు మంజూరు చేసింది. దీంతో నడిగూడెంలో రూ.45 లక్షలు, బృందావనపురంలో రూ.15 లక్షలు, వేణుగోపాలపురంలో రూ.10 లక్షలు, చెన్నకేశ్వాపురంలో రూ.10 లక్షలు, కరివిరాలలో రూ.10 లక్షలు, కాగిత రామచంద్రాపురంలో రూ.15 లక్షలు, నారాయణపురంలో రూ.15 లక్షలు, సిరిపురంలో రూ.25 లక్షలు, వల్లాపురంలో రూ.20 లక్షలు, రత్నవరంలో రూ.15 లక్షలు, రామాపురంలో రూ.15 లక్షలు, శ్రీరంగాపురంలో రూ.10 లక్షలు, చాకిరాలలో రూ.5 లక్షలు, ఎకలాస్‌ఖాన్‌పేటలో రూ.10 లక్షలు, తెల్లబెల్లిలో రూ.15 లక్షలతో సీసీ రహదారుల నిర్మాణ పనులు చేస్తున్నారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయి.

ఎమ్మెల్యే కోటా కింద రూ.65 లక్షలు

కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి నిధులతో నియోజకవర్గ అభివృద్ధికి రూ.65 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులలో మొత్తం 15 గ్రామ పంచాయతీలకు ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.3 లక్షల చొప్పున, అదనంగా కాగితరామచంద్రాపురం, నడిగూడెం, రామాపురం, తెల్లబల్లి గ్రామాలకు రూ.5 లక్షల చొప్పున మంజూరు చేశారు. ఈ నిధులతో మండల పరిధిలోని పలు గ్రామాలలో సీసీ రహదారులు, డ్రెయినేజీల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

ఇబ్బందులు తొలిగాయి



గతంలో మా వీధిలో లోతైన గుంతలు ఉండేవి. దీంతో గుంతల్లో వర్షపు నీరు చేరి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండేది. గతంలో సీసీ రహదారి నిర్మించాలని అనేకసార్లు అధికారులను కోరాం. ఇటీవల సీసీ రహదారి నిర్మించడంతో ఇబ్బందులు తొలిగాయి.

– పచ్చిగోళ్ల శ్రీను, చెన్నకేశ్వాపురం

గతంలో వీధులన్నీ అధ్వానంగా ఉండేవి



నడిగూడెం మండల కేంద్రంలో గతంలో పలు వీధులు అధ్వానంగా ఉండేవి. దీంతో రాకపోకలకు అవస్థలు పడేవాళ్లం. ఇటీవల ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులతో సీసీ రహదారులు నిర్మించారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి.

– కొత్తపల్లి వంశీ, నడిగూడెం

రూ.45 లక్షలతో పనులు



గతంలో ఎన్నడూ లేనివిధంగా కోదాడ ఎమ్మెల్యే పద్మావతి సహకారంతో మండల కేంద్రానికి రూ.45 లక్షలు మంజూరు చేయించుకొని అభివృద్ధి పనులు చేపట్టాం. గతంలో అధ్వానంగా ఉన్న రహదారులన్నిటినీ సీసీ రహదారులుగా మార్చాం.

– గుండు శ్రీనివాస్, ఎంపీటీసీ, నడిగూడెం

మట్టపల్లిలో దీపాదాస్, మంత్రుల పూజలు


శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న దీపాదాస్ మున్షి, రాష్ట్ర మంత్రులు

మఠంపల్లి : మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, రాష్ట్ర మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, మాజీ మంత్రులు కుందూరు జానారెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డిలతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మట్టపల్లిలో జరిగిన నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు ముందుగా ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పాలకవర్గం, అర్చకులు మంత్రులకు పూర్ణకుంభంతో సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా ఆలయ పాకలవర్గం అర్చకులు మంత్రులను స్వామివారి శేషవస్త్రాలతో ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. మంత్రులు ఆలయ ప్రాశస్త్యాన్ని అడిగి తెలుసుకున్నారు. కాగా, ఎన్నికల సన్నాహ క సమావేశంలో కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో కళాకారులు నిర్వహించిన మిమిక్రీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, జయవీర్‌రెడ్డి, బాలునాయక్, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, డీసీసీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, శంకర్ నాయక్, శివారెడ్డి, మంజీనాయక్, ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి


మాట్లాడుతున్న మేదరమెట్ల వెంకటేశ్వరరావు

కోదాడఅర్బన్ : యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటలు నీరందక ఎండిపోయాయని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కోదాడలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన రైతు సంఘం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భూగర్భ జలాలు అడగండడంతో వేల ఎకరాల పంట ఎండిపోయి రైతాంగానికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు అప్పుల పాలయ్యారని, వెంటనే వ్యవసాయ అధికారులు ఎండిపోయిన పంటలను పరిశీలించి ఎకరానికి రూ.30వేల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వీరితో పాటు వందల ఎకరాలు కౌలుకు చేసిన రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అదే విధంగా ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఏనుగుల వీరాంజనేయులు, సంగమయ్య, మరియన్న, ఎం.ముత్యాలు, వెంకటేశ్, నాగరాజు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా సైదులు బాధ్యతల స్వీకరణ


నారాయణపురం పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కొండా సైదులు

చిలుకూరు : మండలంలోని నారాయణపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా కొండా సైదులు శనివారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. సంఘంలో అవినీతి జరిగినట్లు గతంలో పలువురు జిల్లా సహకార సంఘం అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు విచారణ జరిపి సంఘం చైర్మన్‌ను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఈ నెల 23వ తేదీన సంఘంలో అత్యవసర సమావేశం నిర్వహించి తాత్కాలిక చైర్మన్‌గా అదే గ్రామానికి చెందిన డైరెక్టర్ మట్టయ్యను నియమించారు. కాగా, సంఘం చైర్మన్‌గా కొండా సైదులును తొలగించడంతో ఆయన హైదరాబాద్ కోఆపరేటీవ్ ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించడంతో ఆయనపై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ చైర్మన్‌గా సైదులునే యాధావిధిగా కొనసాగించాలని కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది. దీంతో జిల్లా సహకార సంఘం అధికారి ఆదేశాల మేరకు సీఈఓ సాకి బాబు చైర్మన్‌గా సైదులకు తిరిగి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా తిరిగి చైర్మన్ బాధ్యతలు స్వీకరించిన కొండా సైదులును ఘనంగా సన్మానించారు. అనంతరం చైర్మన్ సైదులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

పాఠశాల రోజులు తిరిగి రానివి


మా బడి జ్ఞాపకాల ఒడి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, తదితరులు

- డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడరూరల్ : విద్యార్థులకు పాఠశాల రోజులు తిరిగి రానివని, పాఠశాలలో తమ అనుభవాలను విద్యార్థులు పుస్తకంగా రూపొందించడం అభినందనీయని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. కోదాడ పట్టణ పరిధిలోని తేజ విద్యాలయ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు ఒక్కొక్కరు తమ పాఠశాల అనుభవాలను రాయగా వాటిని 'మా బడి జ్ఞాపకాల ఒడి'అనే పుస్తకం రూపంలో రూపొందించారు. ఆ పుస్తకాన్ని డీఎస్పీ శనివారం పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్య ఎంతో గొప్పదని, ఎంత ఉన్నతమైన చదువులు చదివినా ఇక్కడి స్నేహితులతో అనుబంధాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. పదవ తరగతి పరీక్ష రాసిన విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, ప్రిన్సిపాల్ రమాదేవి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నిర్వాకం వల్లే రైతులకు కష్టాలు

తిరుమలగిరి : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్వాకం వల్లే రైతులకు కష్టాలు వచ్చాయని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టులు పగిలిపోవడంతో అక్టోబర్‌లో నీటిని మొత్తం వదిలేశారని, దాని కారణంగానే ప్రస్తుతం ఎస్సారెస్పీ కాల్వలకు నీళ్లు తగ్గాయని తెలిపారు. చేసిందతా చేసి చివరకు ఇప్పుడు ఏ మొఖం పెట్టుకొని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తుంగతుర్తి నియోజకవర్గానికి వస్తున్నారని ప్రశ్నించారు. గత పది సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమని విమర్శించారు. ప్రాజెక్టుల పేరుతో కోట్ల రూపాయలు కొల్లగొట్టారని తెలిపారు. నియోజకవర్గంలోని బిక్కేరు, మూసీ నదిలో ఉన్న ఇసుక మొత్తాన్ని గత ప్రభుత్వ హయాంలో ఖతం చేశారని, ఇసుక తీయడం వల్లే భూగర్భ జలాలు అడుగంటాయని అన్నారు. కేసీఆర్ వచ్చి మూసీ, బిక్కేరు వాగులను చూడాలని కోరారు. బిక్కేరు వాగుకు వచ్చి అక్కడ నాయకులు వేసిన 3కి.మీ రింగు రోడ్డును చూడాల్సిందిగా డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అంబేద్కర్, పాలకుర్తి రాజయ్య, పైళ్ల సోమిరెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, యాదవరెడ్డి, జెమ్మిలాల్, వీరేష్, లక్ష్మయ్య, నర్సింహారెడ్డి, వెంకటేశ్వర్లు, రాములు, బత్తుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బూరుగడ్డ ఆలయంలో బహిరంగ వేలం


వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ పర్యవేక్షణాధికారి చలపతి తదితరులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి తదితర వస్తువుల అమ్ముకొనుటకు గాను శనివారం ఆలయ ప్రాంగణంలో ఆలయ పర్యవేక్షణాధికారి చలపతి సమక్షంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక ఏడాది కాల పరిమితికి నిర్వహించిన వేలం పాటలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి, పూలు, పండ్లు అమ్ముకునే హక్కును గ్రామానికి చెందిన గువ్వల ఆంజనేయులు రూ.16,500లకు, స్వామివారి వస్త్రాలు సేకరించుకునే హక్కును కొత్తా ప్రవీణ్‌కుమార్ రూ.8,500 లకు, కొబ్బరి కుడకలు సేకరించుకునే హక్కును కీర్తి నర్సయ్య రూ.5 వేలకు వేలంపాటలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ ఎంపి లక్ష్మణరావు, సిబ్బంది యగరాని కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు


అంజయ్యను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న నాయకులు

గరిడేపల్లి : మండలంలోని త్లాళ్లమల్కాపురం గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన రాతికింది అంజయ్య పలువురు మాజీ వార్డు మెంబర్లతో కలిసి శనివారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు వట్టికుటి వెంకటనర్సయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాతికింది అంజయ్య, అనంతు రాములు, పెండెం శ్రీను, శేఖర్, యరగాని వెంకటేశ్వర్లు, వట్టికుటి వెంకటేశ్వర్లు, చెరుకు అంజయ్య, వెంకటేశ్వర్లు, నాగరాజు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణ

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ సాయి పబ్లిక్ స్కూల్‌లో శనివారం విద్యార్థులు పలు రకాల వేషధారణ, వివిధ వృత్తులు, జీవన ప్రమాణాలపై నిర్వహించిన కార్యక్రమం ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బుస్సా సులోచన మాట్లాడుతూ చిన్నారుల అభిరుచులకు అనుగుణంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమ్య, లక్ష్మి, అనీఫా, రజియా, వైదేహీ, మల్లిక, వీరయ్య, సైదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

నడిగూడెం : తరుగు పేరిట రైతులను దోచుకుంటున్న ధాన్యం వ్యాపారులు, మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని తెలుగు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండల పరిధిలోని తెల్లబల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎక్కడా లేని విధంగా కేవలం కోదాడ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో వ్యాపారులు రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

రామచంద్రయ్య మృతి సీపీఎంకు తీరని లోటు


రామచంద్రయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గరిడేపల్లి : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు చింతకాయల రామచంద్రయ్య మృతి సీపీఎంకు తీరని లోటని పార్టీ మండల కార్యదర్శి షేక్ యాకూబ్ అన్నారు. శనివారం గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో ఆయన మృతదేహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ సీనియర్ నాయకులు తుమ్మల సైదయ్య, జుట్టుకొండ వెంకటేశ్వర్లు, బొల్లెపల్లి శ్రీనివాస్, బొమ్మకంటి వెంకయ్య, బంగారు శ్రీను, రాఘవులు, సత్యనారాయణ, వెంకన్న, మట్టయ్య, వీరరాఘవయ్య ఉన్నారు.

వాహనాల తనిఖీ

సూర్యాపేట రూరల్ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని టేకుమట్ల హైవేపై పోలీసులు శనివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.లక్ష 50వేల నగదు పట్టుబడింది. హైదరాబాద్ నుంచి ఆశ్వాపురం వెళ్తున్న కారును తనిఖీ చేయగా నగదు పట్టుబడినట్లు ఏఎస్ఐ ముత్తయ్య తెలిపారు. సరైన ఆధారాలు చెప్పకపోవడంతో సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు


రావిపహాడ్‌లో రహదారి వెంట కంపచెట్లను తొలగిస్తున్న ఉపాధి హామీ కూలీలు

పాలకవీడు : మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శనివారం రావిపహాడ్, బెట్టెతండా, మిగడంపహాడ్ తండా గ్రామాల్లో కూలీలు ఉపాధి హామీ పనులకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలి కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లలేక పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తుగా పనులను గుర్తించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా కాల్వల పూడికతీత, కంపచెట్ల తొలగింపు తదితర పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించి వారి బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ చేస్తున్నట్లు ఎంపీఓ దయాకర్ తెలిపారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం


సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

హుజూర్‌నగర్ : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తమ పాఠశాల లక్ష్యమని ఎండీఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎం.దామోదర్‌రెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని ఎండీఆర్ హై స్కూల్‌లో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరంలో వివిధ రకాల పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేశామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి శివకుమార్

నేరేడుచర్ల : పార్లమెంట్ ఎన్నికల్లో అవినీతి బీఆర్‌ఎస్, మతతత్వ బీజేపీలను ఓడించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. శనివారం నేరేడుచర్లలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల్లో మతతత్వాన్ని పెంచిపోషిస్తూ విద్వేశాలను సృష్టించిందన్నారు. రాముడి పేరుతో రాజకీయాలు చేస్తూ బహుజనులు, మైనార్టీలు, దళితులపై దాడులు చేస్తుందని, వారిని జీవించే హక్కు కోల్పోయేలా చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత లిక్కర్ కేసులో ఇరుక్కుందని, ఫోన్ ట్యాపింగ్‌లో కేటీఆర్, హరీష్‌రావులు కూడా జైలుకు పోక తప్పదన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వాస పల్లయ్య, నాయకులు అఖిల్‌కుమార్, హుస్సేన్, కరుణాకర్, సత్తెమ్మ, శ్రీను, పావని, మరియమ్మ, మల్లేశ్వరి, లక్ష్మి, రమణ, దుర్గ, మౌలాంబి, లక్ష్మయ్య, కోటమ్మ, ఫాతిమా, సయ్యద్, సుమలత, శ్యామల తదితరులు ఉన్నారు.

పిచ్చికుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన లోహితాక్షు

మఠంపల్లి : మండలంలోని గుండ్లపల్లిలో పిచ్చికుక్క దాడి చేయడంతో మూడేళ్ల బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గాబుల కోటేష్ మనువడు లోహితాక్షు ఇంట్లో ఆడుకుంటుండగా పిచ్చికుక్క ఇంట్లోకి చొరబడి బాలుడిపై దాడి చేసి విచ్చలవిడిగా కరిచి బాలుడిని వీధిలోకి ఈడ్చుకెళ్లింది. భయంతో బాలుడు కేకలు వేయడంతో అప్రమత్తమైన కుటుంబసభ్యులు, స్థానికులు కర్రలతో పిచ్చికుక్కను వెంబడించి కొట్టడంతో చనిపోయింది. తీవ్రంగా గాయపడిన బాలుడిని కుటుంబసభ్యులు హుజూర్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

క్రైస్తవుల రన్ ఫర్ జీసస్ ర్యాలీ



కోదాడఅర్బన్ : రన్ ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

కోదాడఅర్బన్ : గుడ్ ఫ్రైడే, ఈస్టర్ వేడుకల సందర్భంగా కోదాడ పట్టణంలో యునైటెడ్ పాస్టర్స్, క్రిస్టియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నియోజకవర్గ స్థాయిలో క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ వి.యేసయ్య, అబ్రహం, జోసెఫ్, సుందర్ రావు, తిరుపతయ్య, జగ్గునాయక్, శ్రావణ్‌కుమార్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.


నేరేడుచర్ల : రన్ ఫర్ జీసస్ ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ప్రకాశ్

నేరేడుచర్ల : ఈస్టర్ వేడుకలో భాగంగా శనివారం యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేరేడుచర్లలో రన్ ఫర్ జీసస్ ర్యాలీని మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, జెడ్పీటీసీ రాపోలు నర్సయ్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరిని సమానంగా చూడాలని, అందిరితో ప్రేమ, కరుణ, దయతో మెలగాలని చెప్పిన మహనీయుడు ఏసుక్రీస్తు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాపోలు నవీన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు, నాయకులు కర్రి సతీష్‌రెడ్డి, ఖలీమ్, పాస్టర్లు పిలిప్, శ్యామ్, నతానియేలు తదితరులు ఉన్నారు.

సీఆర్‌పీఎఫ్ బలగాల కవాతు


కవాతు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

నేరేడుచర్ల : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో శనివారం నేరేడుచర్ల పట్టణంలో కోదాడ- జడ్చర్ల ప్రధాన రాహదారి, జాన్‌పహాడ్ రోడ్డులోని రాంపురం వద్ద సీఆర్‌పీఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులు ఎస్ఐ రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మీనర్సయ్య, పోలీసులు తదితరులు ఉన్నారు.

నేడు తుంగతుర్తికి కేసీఆర్ రాక

తుంగతుర్తి : మండల పరిధిలోని వెలుగుపల్లి శివారులో ఎండిపోయిన వరి పంట పొలాలను పరిశీలించడానికి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదివారం వస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయనతోపాటు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ రానున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు గుండగాని రాములు, తదితరులు పాల్గొన్నారు.

పంట కోత.. కిరాయి మోత

- ఏటేటా పెరుగుతున్న వరికోత మిషన్ కిరాయి ధరలు
- కూలీల కొరతతో యంత్రాలపైనే ఆధారపడుతున్న రైతులు
- వ్యవసాయాన్ని ఉపాధి హామీకి అనుసంధానం చేయాలని వేడుకోలు


మేళ్లచెరువులో వరి పంట కోస్తున్న కోతమిషన్

మేళ్లచెరువు : యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటల కోతలు ప్రారంభం అయ్యాయి. మండలంలోని చెరువులు, బావులు, బోర్ల కింద సాగు చేసిన వరి చేలను కోసే పనుల్లో రైతులు నిమగ్నం అయ్యారు. కూలీల కొరత ఉండడంతో రైతులు వరికోత యంత్రాలపైనే ఆధారపడుతున్నారు. దీంతో కోత మిషన్‌ల యజమానులు, ఏజెంట్‌లు.. రైతుల అవసరాలను బట్టి ఏటేటా కిరాయి పెంచుతున్నారు. టూ విలర్ మిషన్‌కు గంటకు రూ.2500 తీసుకుంటుండగా చైన్ మిషన్‌కు రూ.3000, ఫోర్ వీలర్ మిషన్‌కు రూ.2800 నుంచి రూ. 3000 వేల వరకు వసూలు చేస్తున్నారు. అయితే కూలీలతో కోతలు చేపడితే 15 రోజుల వరకు నూర్పిడికి సమయం పడుతుంది. ఆ సమయంలో వర్షాలు పడితే కోసిన పంట దెబ్బతినే అవకాశం ఉండడంతో రైతులు యంత్రాలతో కోతలు కోయడానికి మొగ్గు చూపుతున్నారు. కాగా, మండలంలోని మేళ్లచెరువు, కందిబండ, రామాపురం, కప్పలకుంటతండా, నల్లబండగూడెం, మంగళికుంటతండా, హేమ్లాతండా, యర్రగట్టుతండా, వెంకట్రామాపురం, వేపలమాధవరం, రేవూరు గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు.

కోతమిషన్ల కిరాయి ధరలు తగ్గించాలి



వరి కోత మిషన్ల కిరాయి ధరలు తగ్గించాలి. కూలీల కొరతతో రైతులంతా యంత్రాల వైపు మొగ్గు చూపవుతున్నాం. కానీ యంత్రాల కిరాయి ఏటేటా పెంచుతున్నారు. అయినా యంత్రాలతో కోతలు కోయించక తప్పడం లేదు. యంత్రాల ద్వారా వరికోతలు కోసే రైతులకు ప్రభుత్వం సహాయం అందించాలి.

– ధారావత్ సక్యానాయక్, హేమ్లాతండా

'ఉపాధి హామీ'కి అనుసంధానం చేయాలి



వ్యవసాయ పనులకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి రైతులకు లబ్ధి చేకూరేలా చూడాలి. వరి నాటేందుకు అవసరమైన కూలీలు లేదా యంత్రాలు, కోత మిషన్లకు ఉపాధి హామీ పథకం ద్వారా కిరాయి చెల్లించినట్లయితే రైతులకు భారం తగ్గి వారి జీవన స్థితి మెరుగుపడుతుంది.

– వట్టెపు సైదులు సీపీఎం మండల కార్యదర్శి